సాక్షి సిద్దిపేట

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



నిజాయితీ చాటుకున్న..

ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన పర్సును కండక్టర్ గుర్తించి డీఎంకు అందజేశారు. వివరాలు IIలో ▸



పల్లెగొంతు తడపండి

పల్లెల్లో చేతిపంపులు మరమ్మతులకు గురవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలు IIIలో ▸



రుతుక్రమంపై అవగాహన

రుతుక్రమంపై అవగాహన ఉండాలని ప్రముఖ మహిళా వైద్య నిపుణులు శిరీష అన్నారు. వివరాలు IIIలో ▸

రూ.కోట్ల భూములకు.. అత్తెసరు పరిహారమా?

రూ.కోట్లు పలికే భూములకు అత్తెసరు పరిహారం ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నారంటూ ట్రిపుల్‌ఆర్ భూ బాధితుల్లో ఆక్రోశం వ్యక్తమవుతోంది. భూముల ప్రభుత్వ విలువపై పట్టణ ప్రాంతాల్లో రెండింతలు, గ్రామీణ ప్రాంతాల్లో మూడింతలు ఇవ్వనున్నట్లు సంకేతాలు వస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 4,832ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు. మే లేదా జూన్ నెలలో భూముల స్వాధీనానికి రంగం కూడా సిద్ధమైంది. పరిహారం తేల్చకుండానే అధికారుల కార్యాచరణ వేగవంతం చేయడంతో బాధితుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

ట్రిపుల్‌ఆర్ భూబాధితుల ఆక్రోశం

- ప్రభుత్వ విలువపై రెండు లేదా మూడింతలే..
- ఎన్‌హెచ్ యాక్ట్ ప్రకారం ముందుకు
- ఉత్తర భాగంలో 4,832 ఎకరాల భూసేకరణ పూర్తి
- భూముల స్వాధీనానికి రంగం సిద్ధం

సాక్షి పరిశీలన

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం భూబాధితుల పరిహారం లెక్కల వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. రూ.కోట్ల విలువైన భూములకు పొంతన లేని పరిహారం ఇవ్వడానికి రంగం సిద్ధమవుతుండటమే కారణం. ట్రిపుల్‌ఆర్ భూసేకరణ కోసం రెవెన్యూ డివిజన్ల వారీగా కాలా (కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజైషన్)లు పనిచేస్తున్న సంగతి తెలిసిందే. చౌటుప్పల్, యాదాద్రి-భువనగిరి పరిధిలో మూడు కాలాలతోపాటు గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్, ఆందోల్-జోగిపేట, సంగారెడ్డి కాలాల పరిధిలోని 84గ్రామాల్లో 4832.5ఎకరాల వరకు భూసేకరణ లక్ష్యంగా ఉండగా, ఇందులో దాదాపుగా సేకరించారు. ఇందులో 180 ఎకరాల అటవీ భూమి, మరో 650 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది.

పొంతనలేని లెక్కలు

సేకరిస్తున్న భూమికి ప్రభుత్వ విలువపై రెండు లేదా మూడింతలు మాత్రమే పరిహారం ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఉత్తర భాగంలో ప్రభుత్వ విలువ ప్రకారం చూస్తే సంగారెడ్డి ప్రాంతంలోని కొన్ని సర్వే నంబర్లల్లోని భూమి అత్యధికంగా రూ.75లక్షలు పలుకుతోంది. ఇది మున్సిపాలిటీ పరిధిలోకి వస్తే రూ.1.5కోట్ల పరిహారం అందే అవకాశం ఉంది. నిజానికి ఈ భూమికి బహిరంగ మార్కెట్‌లో ధరను పరిశీలిస్తే.. రూ.10కోట్లకుపైనే ఉంటుంది. ప్రభుత్వ విలువ ప్రకారం చూస్తే చౌటుప్పల్, గజ్వేల్, తూప్రాన్, నర్సాపూర్ లాంటి పట్టణ ప్రాంతాల్లో ఎకరాకు అత్యధికంగా రూ.20లక్షల నుంచి రూ.50లక్షల విలువ కలిగిన భూములు ఉన్నాయి. నిజానికి బహిరంగ మార్కెట్‌లో వాటి ధర రూ.5నుంచి 7కోట్ల వరకు పలికే అవకాశముంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ కొన్ని చోట్ల గరిష్ఠంగా రూ.10లక్షలకుపైగా ప్రభుత్వ విలువ కలిగిన భూములు ఉన్నాయి. కానీ భూములకు మార్కెట్ ధరతో పోలిస్తే పొంతన లేని పరిహారం పొందే అవకాశముంది. ముఖ్యమైన విషయమేటంటే భూముల ప్రభుత్వ విలువల పెంపు శాస్త్రీయంగా జరగకపోవడం కూడా బాధితుల తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.



సామలపల్లిలో ట్రిపుల్‌ఆర్ నిర్మాణం వల్ల సర్వం కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



వర్గల్ మండలం సామలపల్లిలో ట్రిపుల్‌ఆర్ ఇంటర్ ఛేంజ్ కోసం గజ్వేల్-తూప్రాన్ రోడ్డు పక్కన సేకరించనున్న భూమిని చూపుతున్న మహిళా రైతు మైసగోని వెంకటమ్మ

అదనపు భూసేకరణ

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో 11చోట్ల ఇంటర్‌ఛేంజ్‌ల నిర్మాణం చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) నిర్ణయించింది. వీటి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రస్తుత హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డు కంటే మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో పలు ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అదనపు భూసేకరణ అవసరమవుతోంది. దీంతో ఇంటర్‌చేంజ్ ప్రదేశాల్లోనూ బాధిత రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

బిడ్డల పెళ్లిళ్లు ఎట్ల జేయాల్నో..



గజ్వేల్-తూప్రాన్ రోడ్డు పక్కనే ఎకరా 5గుంటల భూమి ఉంది. ఎకరాకు రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు పలుకుతుంది. భూమి మొత్తం పోతోంది. నామమాత్రంగా పరిహారం ఇస్తే నా బిడ్డల పెళ్లిళ్లు ఎట్ల జేయాలి. - చిన్న ఆగం గౌడ్, సామలపల్లి, వర్గల్

రూ.2కోట్లు ఇస్తామన్నా అమ్ముకోలే



నాలుగెకరాల భూమి ఉంది. గతంలో ఎకరాకు రూ.2కోట్లు ధర చెల్లిస్తామని అడిగితే అమ్ముకోలే.. కానీ నేడు ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో మొత్తం భూమి పోతోంది. పొంతన లేకుండా పరిహారం ఇస్తామంటున్నారు. ఇదేం పద్ధతి? - జోసెఫ్‌రెడ్డి, అలిరాజపేట, జగదేవ్‌పూర్

నిబంధనల మేరకే భూసేకరణ

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగానికి సంబంధించిన భూసేకరణ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొనసాగుతోంది. ఎన్‌హెచ్ 1956 చట్టం ప్రకారం ఈ భూసేకరణ జరుగుతుంది. పరిహారం పంపిణీ కూడా మే లేదా జూన్ నెలలో పూర్తి కానుంది. దీని తర్వాత భూముల స్వాధీనానికి చర్యలుంటాయి. - తోసిఫ్, డిప్యూటీ మేనేజర్, ఎన్‌హెచ్ఏఐ

బీఆర్‌ఎస్ రక్షణ కవచం

తెలంగాణకు శ్రీరామరక్ష

రజతోత్సవ సభకు అద్భుతమైన స్పందన

- పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం
- 'సాక్షి'తో ఎమ్మెల్సీ, రచయిత, గాయకుడు దేశపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

బీఆర్‌ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) పార్టీ తెలంగాణ ప్రజల రక్షణ కవచమని ఎమ్మెల్సీ, రచయిత దేశపతి శ్రీనివాస్ అన్నారు. పార్టీ తెలంగాణను పునఃనిర్మాణం చేసిందని, కాంగ్రెస్‌కు అధికారం తప్ప.. ప్రజల గురించి ఆలోచించడంలేదని తెలిపారు. రజతోత్సవ సభకు అద్భుతమైన స్పందన వస్తోందని, మూడేళ్ల తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశపతి శ్రీనివాస్‌ను రజతోత్సవం సందర్భంగా 'సాక్షి' పలకరించింది. వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

సాక్షి, సిద్దిపేట: సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఒక అనాథ.. తెలంగాణకు అన్యాయం జరిగితే అడిగే దిక్కులేదు. వివక్షకు గురవుతుంటే అడిగే వారేలేరు. కాంగ్రెస్‌లో ఉన్న నాయకులు తెలంగాణను ఒక అంగడి సరుకు చేసి తమకు పదవి రానప్పుడల్లా ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌ను ఎత్తుకోవడం పదవి రాగానే దించడం చేశారు. దీంతో ప్రజల్లో ఉద్యమంపై, ప్రత్యేక రాష్ట్రం వస్తుందని ఆశ లేకుండా పోయింది. 1969లో 369 బలిదానాలు జరిగినా కేంద్రంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాసింది. సరిగ్గా ఈ సమయంలోనే ప్రత్యేక రాష్ట్రంపై ప్రజల్లో కేసీఆర్ ఆశలు చిగురింపజేశారు. గులాబీ జెండాను ఎత్తి 2001లో జలదృశ్యంలో టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు మూగబోయిన తెలంగాణ ఉద్యమం సింహగర్జన చేసింది. నిర్జీవమైన ఉద్యమం మళ్లీ ప్రాణం పోసుకుంది. అనేక ఉద్యమాలతో అప్పటి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాం. బీఆర్‌ఎస్ పార్టీ జెండా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ బావుట. తెలంగాణను పునఃనిర్మాణం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీది. పదేళ్ల పరిపాలనలో చల్లగా బతికింది. కేసీఆర్ పరిపాలనలో భూమి మీద నీళ్లు పారాయి. కేసీఆర్ వచ్చిన తర్వాతనే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి, కొత్తగా కాళేశ్వరం నిర్మించి, పాలమూరు ఎత్తిపోతల పథకంను 80శాతం, సీతారామను 90శాతం, అనేక చెక్ డ్యాంలు నిర్మాణాలయ్యాయి. దీంతో చెరువులు బాగుపడ్డాయి.

జలాలు.. ధాన్యం రాశులు

ఆనాడు నీటి కోసం అలమటించిన తెలంగాణ.. కేసీఆర్ సీఎం అయ్యాక ఏటు చూసినా జల రాశులు, పంట రాశులు దర్శనమిచ్చాయి. కరోనా వచ్చినా రాష్ట్ర ఆర్థిక ప్రగతి ఆగలేదు. పదేళ్లలో ఆర్థిక వృద్ధి పెరగడంతోపాటు 1.60లక్షల ఉద్యోగాలు ఇచ్చారు. ఆ ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులను తీసుకవచ్చింది బీఆర్‌ఎస్ పార్టీ. పల్లెలు పట్టణాలు అభివృద్ధి చెందాయి. అభివృద్ధిని జీర్ణించుకోలేని విపక్షాలు దుష్ప్రచారాలు చేశాయి. గోరంతను కొండంతగా చూపించాయి. ప్రజలను తప్పుదోవ పట్టించాయి. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్‌ఎస్ లేని రాజకీయాలను ఊహించలేం. కొంత ఆత్మపరిశీలన చేసుకున్నాం. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పరిపాలన, సంక్షేమ పథకాలు అమలు ఎలా ఉండేవి అన్న ఆలోచన ప్రజలు చేస్తున్నారు.

కాంగ్రెస్ తీరు అర్థమైంది..

కాంగ్రెస్ నేతలకు అధికారం అనుభవించాలనే కోరిక తప్ప.. ప్రజలకు మేలు చేద్దామనే ఆలోచన లేదు. కాంగ్రెస్ పార్టీతో అన్ని కోల్పోతున్నామని ప్రజలకు అర్థమవుతోంది. కాళేశ్వరం నీటితో చెరువులు నింపుతున్న పరిస్థితి లేదు. చెరువులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మళ్లీ కరువు వచ్చేస్తోంది. కరెంట్ సమస్యలు వస్తున్నాయి. పదేళ్లలో ఆర్థిక వృద్ధి రేటు పెరిగితే సంవత్సరం నుంచి క్షీణత మొదలైంది. రియల్ రంగం కుదేలైంది. దీంతో తెలంగాణ తిరోగమన దిశ ప్రారంభమైంది.

కేసీఆర్ మాటలు వినాలని..

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అద్భుతమైన స్పందన వస్తోంది. కేసీఆర్‌ను చూడాలని.. ఆయన మాటలు వినాలని గులాబీ దండు కదిలివస్తోంది. బండ్లు కట్టుకుని.. నడచుకుంటూ వరంగల్‌కు చేరుకుంటున్నారు. రజతోత్సవం బీఆర్‌ఎస్ పండుగే కాదు.. ప్రజల ఆత్మగౌరవం. కచ్చితంగా రాబోయే రోజుల్లో మంచి జరగాలన్నా.. రైతు బంధు రావాలన్నా.. బడుగులకు భరోసా దొరకాలన్నా.. బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని ప్రజలు ఆలోచిస్తున్నారు. మూడేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం.

న్యూస్‌రీల్

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

ఏజీఎం లక్ష్మణ్ బానోత్



వినియోగదారుల మేళాలో ఏజీఎం లక్ష్మణ్

సిద్దిపేటకమాన్: బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) లక్ష్మణ్ బానోత్ తెలిపారు. సిద్దిపేటలో శుక్రవారం వినియోగదారుల మేళా కార్యక్రమం నిర్వహించారు. మేళాలో పలువురు బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు పలు సమస్యలపై సంప్రదించగా సిబ్బంది పరిష్కరించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం లక్ష్మణ్ మాట్లాడుతూ.. వినియోగదారుల సౌకర్యార్థం అత్యాధునిక టెక్నాలజీతో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏస్డీఈలు మోహన్‌రెడ్డి, రవీందర్, రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

సివిల్ సప్లై సీఆర్‌ఓ ఫణిందర్



దుద్దెడలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫణిందర్

కొండపాక(గజ్వేల్): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలోనే అమ్ముకోవాలని సివిల్ సప్లై సీఆర్‌ఓ (ఐఏఎస్) ఫణిందర్ అన్నారు. దుద్దెడలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధ్యాన్యం కొనుగోళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీరు, నీడ నిచ్చే సౌకర్యాలను ఏర్పాటు చేయలేదని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఫణిందర్ మాట్లాడుతూ కొనుగోళ్ల కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అకాల వర్షాలు కురుస్తున్న వేళ కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చేటప్పుడు టార్పాలిన్ కవర్లను తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు.. పిడుగులు

- పలు ప్రాంతాల్లో గాలివాన
- భయాందోళనకు గురైన ప్రజలు



తాటిచెట్టుపై పిడుగు పడటంతో మంటలు



బల్వంతాపూర్‌లో కొబ్బరిచెట్టుపై పిడుగు

దుబ్బాక/దుబ్బాకరూరల్: మండల పరిధిలోని బల్వంతాపూర్, తొగుట మండలం గుడికందుల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో పిడుగులు పడడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బల్వంతాపూర్‌లో ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టు, గుడికందులలో ఇళ్లసమీపంలోని తాటిచెట్టుపై పిడుగులు పడి మంటలు ఎగసిపడ్డాయి.

వరదరాజుపల్లిలో పాడిగేదెలు మృతి

తొగుట(దుబ్బాక): పిడుగుపాటుకు పాడిగేదెలు మృతిచెందాయి. ఈ ఘటన వరదరాజుపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రేపాక పరశురాములు తన వ్యవసాయ పొలం వద్ద పాడిగేదెలను కట్టేసిన చెట్టుపై పిడుగుపడింది. దీంతో గేదెలు మృతి చెందాయి.

నిలిచిన రాకపోకలు..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలో ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో రోడ్లపై చెట్లు విరిగి పడటంతో వాహనదారుల రాకపోకలు నిలిచి పోయాయి. గంట పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది.



ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

భూ భారతితో సమస్యల పరిష్కారం

- అత్యంత పారదర్శకంగా అమలు
- కలెక్టర్ మనుచౌదరి

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎదైన భూ సమస్య ఉంటే డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫీల్డ్ ఎంక్వయిరీ, ఇరువర్గాలను పిలిచి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్ పరిశీలనచేసి నిర్ణీత కాలంలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. భూమికి సంబంధించిన ఏ సమస్య అయినా ఆర్డీఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో జరుగుతాయని వివరించారు. అలాగే అన్ని వివరాలతో కూడిన భూఆధార్ కార్డును రైతులకు అందించనున్నట్లు తెలిపారు. దీంతో భూఅక్రమాలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు అనంతరం దూల్మిట్ట మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అధికారులతో కలసి సందర్శించారు. కొంత కాలంగా మూసి ఉన్న వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహానికి కావల్సిన మౌలిక వసతులు వెంటనే కల్పించి వచ్చే విద్యాసంవత్సరం అరంభం నాటికి వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, ఆయా మండలాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

పహల్గామ్ మృతులకు నివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శుక్రవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మార్కెట్ చైర్ పర్సన్ శ్వేత, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆగంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు నర్సింగరావు, కళావతి, చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి సిద్దిపేటకు పేగుబంధం

- పాదయాత్ర విజయయాత్ర కావడం ఖాయం
- గెలిచినా ఓడినా ప్రజల పక్షమే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



పాదయాత్రలో పాల్గొన్న బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పడి 25 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ సభకు సిద్దిపేట నుంచి బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగాల ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద అమరవీరులకు, పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. అనంతరం వరంగల్‌కు పాదయాత్రను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మిట్టపల్లి వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాలు నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర.. పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్ర కాబోతుందన్నారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి కానీ బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించిందన్నారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏళ్ల ఉద్యమం, 10 ఏళ్ల ప్రభుత్వం ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం. ఏ పాత్ర అయినా బీఆర్‌ఎస్ తెలంగాణ పక్షం వైపే ఉండి పోరాడుతుందన్నారు. 44 డిగ్రీల ఎండను సైతం లెక్క చేయకుండా 1500 మంది యువత పాదయాత్రగా రజతోత్సవ సభకు బయలుదేరడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్.. గాంధీ చూపిన బాటలో ఉద్యమాన్ని ముందుకు నడిపారన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో, అభివృద్ధి సంక్షేమాల్లో, అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చింది, కాంగ్రెస్ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయన్నారు. పాదయాత్ర పొడుగునా కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించాలని, రోజూ మధ్యాహ్నం, రాత్రి భోజన సమయంలో మిమ్మల్ని కలుసుకుంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరీశ్‌రావు దిశానిర్దేశం



యువకులకు దిశా నిర్దేశం చేస్తున్న హరీష్‌రావు

నంగునూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మధ్యాహ్నం పాలమాకులకు చేరుకుంది. భోజనాల అనంతరం ఎమ్మెల్యే హరీష్‌రావు యవకులకు దిశానిర్దేశం చేశారు. 'నేను మీతో కలసి పాదయాత్ర చేస్తా.. మిమ్ములను గుండెలో పెట్టుకొంటా' అని అన్నారు. యువకులు క్రమశిక్షణతో వరంగల్ వరకు పాదయాత్ర చేయాలన్నారు. ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సాయంత్రం తిరిగి పాదయాత్ర ప్రారంభించిన యువకులు రాత్రి బద్దిపడగలో బస చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

నంగునూరు(సిద్దిపేట): వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండటంతో ధాన్యం దళారుల పాలు అవుతోందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పాలమాకులలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వడ్లు అమ్మి వారం రోజులు గడుస్తున్నా డబ్బులు రాలేదని రైతులు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు వచ్చేలా చూడాలని అన్నారు. గత యేడాది లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని చెప్పి కేవలం 52 వేల మెట్రిక్ టన్నులే సేకరించిందన్నారు.

క్లుప్తంగా

మహిళల రక్షణకు పెద్దపీట

● సమావేశంలో సీపీ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సీపీ అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్‌లో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ డాటా ప్రకారం క్రైమ్ రివ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీ ఉపయోగించడం, నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. రౌడీలు, అనుమానితులను తనిఖీ చేసి వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టకూడదని సూచించారు. అడవిపందుల నుంచి పంట రక్షణ కోసం చుట్టూ కరెంటు వైర్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులను పిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐలు శ్రీనివాస్, శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి



వీరస్వామి

పాపన్నపేట(మెదక్): దర్శనానికి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మరికెల్ గ్రామానికి చెందిన వీరస్వామి (40) తన భార్యాపిల్లలతో కలిసి బంధువుల విందులో పాల్గొనడానికి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు చెక్‌డ్యాంలో స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.

ఏడుపాయల్లో మృతదేహం గుర్తింపు

● కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం
● అనంతరం పూడ్చివేసిన పోలీసులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మహేశ్(37)ను గత నెల 26న నగల కోసం తీసుకొచ్చి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పాపన్నపేట మండలం ఏడుపాయల శివారులోని మొదటి బ్రిడ్జి వద్ద హత్య చేసినట్లు అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి మహేశ్ మృతదేహంగా గుర్తించారు. శవం కుళ్లిపోయి ఉండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం ... చేగుంట శివారులోని మక్కరాజీపేట బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదు. మృతుడు గోధుమరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు.

కోల్డ్ స్టోరేజీ గోదాం ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

కొండపాక(గజ్వేల్): అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాంలో అగ్ని ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం... కొండపాక మండలంలోని మర్పడ్గ గ్రామ శివారులో సిద్దిపేటకు చెందిన వ్యాపారులు అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాంను ఏర్పాటు చేశారు. ఈనెల15న కోల్డ్ స్టోరేజీ పక్కన భూమిని కౌలుకు తీసుకున్న రైతు రాజయ్య ఖరీఫ్ సీజన్ పనుల కోసం పత్తి పొరకకు నిప్పంటించాడు. మంటలు ఒక్కసారిగా కోల్డ్ స్టోరేజీ గోదాంలోకి ప్రవేశించి రూ. 1.50 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ ఫిర్యాదు మేరకు రాజయ్యపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అరటి పండ్లను ఇవ్వడం లేదన్న కక్షతో గోదాం పక్కన పత్తి పొరకకు నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. రాజయ్య పరారీలో ఉండటంతో శుక్రవారం అరెస్టు చేశారు.


రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్ : మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్ : ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్ : ధర్మసాగర్–దేవునూరు –దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్ : కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్ : సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

పార్కింగ్ జోన్లు 5
కేటాయించిన భూమి 1,179

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు
సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

చిరుత కలకలం

● రెండు కుక్కల పై దాడి చేసి చంపిన వైనం
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు



చిరుత పులి పాదముద్రలు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మరోసారి చిరుత పులి కలకలం సృష్టించింది. రెండు కుక్కలపై దాడి చేసి చంపింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చిరుత ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శుక్రవారం దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ వడ్డేపల్లి గ్రామ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. చిరుత పాద ముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేముల రాజమల్లయ్య వ్యవసాయ పొలం వద్ద రెండు కుక్కలపై దాడిచేసి చంపింది చిరుతనేనని నిర్ధారించారు. దాని జాడ కోసం అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుత ఎప్పుడు ఒకే చోట నివాసం ఉండదని తరచూ సంచరిస్తుందని సూచించారు. అడవికి దగ్గరగా వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పొలాల వద్ద ఉంచకూడదన్నారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, బీట్ ఆఫీసర్ వేణు తదితరులున్నారు.

అప్పులు.. ఆపై కుటుంబ కలహాలు

వ్యక్తి ఆత్మహత్య



పొగాకు స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాలలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ పరశురామ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పొగాకు స్వామి (31) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ భార్య, పిల్లలను పోషిస్తున్నాడు. ఇటీవల అందినకాడికి అప్పులు చేసి రూ. 11 లక్షలతో బొలేరో వాహనాన్ని కొనుగోలు చేశాడు. వాహనం కొన్న నాటి నుంచి సరైన గిరాకీలు లేక తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోయాడు. దీనికి తోడు ఇంట్లో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట (మెదక్): గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... పాపన్నపేట గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఉండటాన్ని శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వ్యక్తి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. ఒంటిపై కుంకుమ రంగు షర్టు, నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బట్టి, సుమారు పది–పదిహేను రోజుల క్రితం ఉరి వేసుకొని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... ఈ నెల 23న ఉదయం శ్రీనివాస్(40) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఊరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి...



రాజు (ఫైల్)

రామాయంపేట(మెదక్): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఝాన్సీలింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కల్వాల రాజు (35) మిషన్ భగీరథ వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తన భార్యతో గొడవ పడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. అదే గ్రామంలో ఓ రైతు పంట చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



గీత(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): బాలిక అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం... మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన డప్పు గీత(15) అందోలు రెసిడెన్సియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వార్షిక పరీక్షల అనతరం పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. ఈనెల 18న రాత్రి తన కుటుంబీకులతో కలిసి భోజనం చేసి అందరూ నిద్రకు ఉపక్రమించిన తర్వాత తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు లేచి చూసే సరికి కూతురు కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలకు వెళ్లిన విద్యార్థి..



షాహీదా ఖుతున్

జహీరాబాద్ టౌన్: కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్.ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ షమీమ్‌కు ఇద్దరు కొడుకులు, ఐదుగురు ఆడపిల్లలు. ఐదో కూతురు షాహీదా ఖుతున్(20) స్థానిక ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 23న అక్క ఆయేషా ఖుతున్‌తో కలిసి కళాశాలకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఘటనా స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు



బాలరాజ్



నవీన్

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలోని ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం కథనం మేరకు... సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండల కేంద్రానికి చెందిన ఎల్లపోల్ల బాలరాజ్ (32) సొంత పనిపై హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి నర్సాపూర్ మీదుగా స్వగ్రామానికి వస్తున్నాడు. నర్సాపూర్‌కు చెందిన చింతకుంట నవీన్ (26) బైక్‌పై సంగారెడ్డి వైపు నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వస్తూ ఎదురుగా వస్తున్న బాలరాజు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో బాల్‌రాజు అక్కడికక్కడే మృతి చెందగా నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు నవీన్‌ను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అతడు మృతి చెందాడు. బాలరాజ్ భార్య సుమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలరాజుకు భార్య, పిల్లలు ఉన్నారు.

మరో ఘటనలో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పులిమామిడి శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేట మండలం దొంగల ధార్మరం గ్రామానికి చెందిన గఫార్(40) దౌల్తాబాద్‌కు బైకుపై డీజిల్ తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో గాయపడిన అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివానందం కథనం ప్రకారం..పట్టణానికి చెందిన గజ్జల బాబు (28) కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారంగా మారడంతోపాటు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 18న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇద్దరు దొంగలు రిమాండ్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటాపూర్ కే గ్రామంలో ఈ నెల 4న బాలచంద్రం గారి ఇంటిలో దొంగతనం జరిగింది. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజేశ్ కథనం మేరకు... శుక్రవారం దొంగతనం కేసు విచారణలో భాగంగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి సొత్తును రికవరీ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు విజయకుమార్, నవీన్, అమీర్ సోహెల్, డ్రైవర్ రమేశ్‌ను ఎస్ఐ అభినందించారు.

మహిళ బ్యాగులోంచి నెక్లెస్ చోరీ

గజ్వేల్‌రూరల్: మహిళ బ్యాగులోంచి బంగారు నెక్లెస్ చోరీకి గురైంది. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా చిట్యాలకు చెందిన మాసగోని లావణ్య ఈనెల 23న ఆర్టీసీ బస్సులో తూప్రాన్ నుంచి గజ్వేల్‌కు చేరుకుంది. పట్టణంలోని బస్టాప్ వద్ద బస్సు దిగి కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఆమె చేతిలోని బ్యాగును చూడగా తెరిచి ఉంది. వెంటనే బ్యాగులో వెతకగా రెండు తులాల బంగారు నెక్లెస్ కనిపించలేదు. ఇంటికి వెళ్లి భర్త నరేశ్‌కు విషయం చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల ‘విజయ’కు ఊరట

● సాత్విక భవిష్యత్తుకు ఎమ్మెల్యే హరీశ్ రావు భరోసా
● ఆయన చొరవతో వ్యాపారి చేయూత

సాక్షి ఎఫెక్ట్



సాత్వికకు రెండు లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు, తిరుమల్ రెడ్డి

సిద్దిపేటజోన్: ఇటీవల విద్యార్థుల అవగాహన సదస్సులో తన తల్లి విజయ పడుతున్న కష్టం తలుచుకొని ఏడ్చిన సాత్వికకు దాతలు చేయూతనందిస్తున్నారు. సాత్విక ఆర్థిక పరిస్థితిపై సాక్షిలో ఈనెల 23న ప్రచురితమైన కష్టాల కడలిలో విజయ తీరం వైపు కథనానికి దాతలు ముందుకు వచ్చారు. సాత్విక కుటుంబ పరిస్థితుల గూర్చి ఆరా తీసిన ఎమ్మెల్యే హరీశ్ రావు చొరవతో ఆర్థిక సాయం లభించింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయానికి చిన్నారి సాత్విక, తల్లి విజయను పిలిపించి వారితో కలిసి అల్పాహారం తిన్నారు. అనంతరం తన మిత్రుడి సహాయంతో హైదరాబాద్ వ్యాపారి తిరుమల్‌రెడ్డి ద్వారా రూ.2 లక్షల చెక్కును విజయకు అందించారు. అమ్మ ప్రేమ చాలా గొప్పదని, మంచిగా చదివి భవిష్యత్తులో ఉద్యోగం సాధిస్తే అమ్మ కష్టాలు తీరినట్టేనని సాత్వికతో ఎమ్మెల్యే ఆత్మీయంగా అన్నారు. భవిష్యత్తులో విద్యాపరంగా అండగా ఉంటానని వారికి భరోసానిచ్చారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

పర్సును ప్రయాణికురాలికి అందజేసిన డీఎం



పర్సులో ఉన్న బంగారం, నగదును ప్రయాణికురాలికి అందజేస్తున్న డీఎం టి.రఘు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన పర్సును కండక్టర్ గుర్తించి డీఎంకు అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణం మోడ్రన్ బస్టాండ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేట డిపో మేనేజర్ టి.రఘు వివరాల ప్రకారం... డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి సిద్దిపేటకు వస్తున్న క్రమంలో సిరికొండ మండలం పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన ప్రయాణికురాలు నీరజ బస్సులో వస్తున్నది. ఆమె ముస్తాబాద్‌లో బస్సు దిగే క్రమంలో పర్సు మరిచిపోయింది. దీంతో సిద్దిపేటకు వచ్చిన తరువాత బస్సులో ఉన్న పర్సును కండక్టర్ వేణు గోపాల్ గుర్తించి డిపో మేనేజర్‌కు అందజేశాడు. అనంతరం పర్సులో ఉన్న 10గ్రాముల బంగారం, రూ.10వేలను సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో ప్రయాణికురాలికి డీఎం, స్టేషన్ మేనేజర్ బాలకిషన్, సెక్యూరిటీ సురేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికురాలు డీఎంకు కృతజ్ఞతలు తెలిపింది. ఆర్టీసీ బస్సులో తాను ప్రయాణం చేయకుండా ఉంటే నష్టం జరిగేదని ఆమె పేర్కొన్నారు.

త్వరలో వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన

ఎస్‌డబ్ల్యూజీ కార్యదర్శి అలుగు వర్షిణి



మాట్లాడుతున్న వర్షిణి, ప్రక్కన కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కళాశాలకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర సాంఘీక, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షిణి మాట్లాడుతూ.. రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు పాలన అనుమతులు ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం నుంచి వచ్చినట్లు తెలిపారు. పది రోజుల్లో సంబంధిత భూమిని కలెక్టర్ అందిస్తారన్నారు. మే నెలలో 47 కోట్లు వెచ్చించి కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులకు ఈ కళాశాలలో 75 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నెలో పిడుగు పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... శుక్రవారం సురేశ్ మేకలను మేపేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వర్షం రావడంతో గ్రామ సమీపంలో చెట్టుకింద నిలబడ్డాడు. అదే సమయంలో పిడుగు పడటంతో కిందపడిపోయాడు. గాయాలు కావడంతో అతడి అరుపులను పలువురు గమనించి కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.